ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025



నేడు వీఆర్ఎస్ నుంచి సాగునీరు విడుదల

మక్కువ రూరల్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) ప్రాజెక్టు నుంచి ఆదివారం ఖరీఫ్ పంటలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రదీప్ తెలిపారు. శనివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. 3న మధ్యాహ్నం 2గంటలకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నీటిని విడుదల చేస్తారన్నారు. ప్రాజెక్టు ద్వారా మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాల్లో 24,700 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబీ నాయన, విజయచంద్ర తదితరులు పాల్గొనున్నారని వెల్లడించారు.

స్నేహమేరా జీవితం

● ఒకరికొకరు తోడుగా నిలుస్తున్న మిత్రులు

● మైత్రీ బంధానికి నిదర్శనంగా నిలుస్తున్నది ఎందరో

సాలూరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కష్ట నష్టాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు ముఖం చాటేస్తున్న రోజుల్లో 'మేమున్నామంటూ' అండగా నిలుస్తున్నారు ఈ స్నేహితులు. తమ మిత్రులను ఆదుకోవాలనే లక్ష్యంతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహి స్తున్నారు. అంతటితోనే సరిపెట్టుకోకుండా తాము చదివిన విద్యాసంస్థలకు, సమాజానికి ఎంతోకొంత సాయపడు తున్నారు. సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గతేడాది స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రీయూనియన్ అయ్యారు. వారంతా ఓ గ్రూప్‌గా ఏర్పడి కరోనాలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. తమ స్నేహితుల్లో ముగ్గురికి ఆర్థిక సాయమందించారు. మరో స్నేహితుడు విధులు నిర్వహించడానికి వీలుగా బైక్‌ను సైతం అందించారు. అదే పాఠశాలలో 1980లో పదో తరగతి చదివిన స్నేహితులంతా అప్పుడప్పుడూ రీ యూనియన్ అవుతున్నారు. కెనడాతో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులంతా గతే డాది సాలూరు జూనియర్ కళాశాలలో కలుసుకున్నారు. కుటుంబాలతో హాజరై సందడి చేశారు. వారు చదువు కున్న పాఠశాలకు వేలాది రూపాయలతో సౌండ్ సిస్టం అందించారు. మరో పాఠశాలకు ఇన్వర్టర్‌ను అందించారు. తమ స్నేహి తుల్లో ముగ్గురికి ఆర్థిక సాయం చేశారు. ఇలా వారు తమ మైత్రిని కొనసాగిస్తూ సామాజిక సేవలందిస్తున్నారు.



నేడు స్నేహ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు

6లో


నేడు సిస్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనాలు

6లో

అపురూపం.. అక్కాచెల్లెళ్ల బంధం

6న పాలకొండలో జాబ్‌మేళా

పార్వతీపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. 28 ఏళ్లలోపు వయసున్న యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరుకావొచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటలకు పాలకొండలోని తమ్మినాయుడు డిగ్రీ కళాశాలకు రావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఈ 63012 75511, 79937 95796 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వర్షాలు కురవక.. సాగునీరు అందక!

● అధిక ఎండలకు ఎండుతున్న వరినాట్లు ● అధ్వానంగా కాలువలు

● శివారు భూములకు అందని నీరు ● ఆందోళనలో రైతన్నలు


గరుగుబిల్లిలో ఎండుతున్న వరినాట్లు


రావివలసలో పిల్ల కాలువ ఇలా..

గరుగుబిల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఓ వైపు వరుణుడు ముఖం చాటేయగా.. మరోవైపు ప్రధాన ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందక పోవడంతో జిల్లాలో ఖరీఫ్ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తడులు లేక వరినాట్లు ఎండిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాటిని కాపుడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురవడంతో పలు గ్రామాలకు చెందిన రైతులు వరి ఎదలు, ఉడుపులు నిర్వహించారు. ప్రస్తుతం వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడంతో వరి ఎదలతో పాటు నాట్లు మాడుతున్నాయి. పంట పొలాలు బీడు భూముల్లా దర్శన మిస్తున్నాయి. గరుగుబిల్లి మండలంలో సుమారు 5 వేల ఎకరాలు జంఝావతి కాలువలపై ఆధారపడి ఉంది. అయితే ఆ ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ఇదే ప్రాంతంలో తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు ఉన్నా.. ఏ ప్రయో జనం ఉండడం లేదు. విజ యనగరం, శ్రీకాకుళం, పార్వతీ పురం మన్యం జిల్లాల్లో దిగువ ప్రాంతాలకు సాగునీరు సర ఫరా అవుతుంది తప్ప గరుగు బిల్లి మండలంలో భూములకు నీరందం లేదు. కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పలు చెరు వుల్లో నీరు చేరని పరిస్థితి ఏర్పడింది. నేల బావులు, మోటార్ల సాయంతో నీటిని తెచ్చి పంటను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

కాలువలు ఇలా..

తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని పిల్ల కాలువలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అధికార యంత్రాంగం ప్రధాన కాలువల్లో పూడికతీతలకే పరిమితమైంది. రావివలస ప్రాంతంలోని నక్కలబట్టి నుంచి మర్రాపువాని చెరువుతో పాటు పలు ప్రాంతాల్లోని పరిస్థితి దారుణంగా ఉంది. ప్రధాన కాలువల అభివృద్ధికి (మిగతా 8వ పేజీలో...)

రైతుల సంక్షేమమే లక్ష్యం

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం పట్టణంలోని కోదండరామ కల్యాణ మండపంలో 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయనుందన్నారు. రైతులకు ఏ కష్టం రానివ్వకుండా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' కింద రైతులకు సాగు సాయంగా ఏడాదికి రూ.20 వేలు అందించనున్నట్లు చెప్పారు. తొలి విడతలో భాగంగా ప్రభుత్వం రూ.7వేలు జమచేసినట్లు తెలిపారు. జిల్లాలో 1.22 లక్షల మంది రైతులకు రూ.84.58 కోట్లు అంద జేసినట్లు స్పష్టం చేశారు. సాలూరు నియోజకవర్గంలో 31,294 మంది రైతుల ఖాతాల్లో రూ.21.9కోట్లు జమ చేసినట్లు వివరించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి


కురుపాంలో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాంలో..

కురుపాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రైతులకు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి చెక్కులు అందించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద నియోజకవర్గంలో 39,084 మందికి రూ. 27.36 కోట్ల మంజూ రైనట్లు ఆమె తెలిపారు.

అన్ని రంగాల్లో మన్యం ముందంజలో ఉండాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఆదికర్మయోగి కార్యక్రమం నిర్వహణపై అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో జిల్లా ముందంజలో ఉండేలా కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆశావహ జిల్లాగా నీతి ఆయోగ్ ప్రకటించే విధంగా కృషి చేసిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. నీతి ఆయోగ్ సూచనలకు అనుగుణంగా జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది ఫ్రంట్‌లైన్ కార్మికులందరూ పనిచేయాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలన్నారు. అనంతరం పలువురు అధికారులను పతకాలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ● ఆకాంక్ష హాత్‌తో మహిళా సంఘాల ఆర్థిక స్థితి మెరుగుపడనుందని కలెక్టర్ తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయాల స్టాళ్లను కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. పార్వతీపురం జీడి ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా తయారైన ఉత్పతులు, ప్యాకింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటు ధరల్లో ఈ ఉత్పత్తులను వినియోగదారులు పొందొచ్చని తెలిపారు. ఆ తర్వాత తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ, ఏపీవో ఎ.మురళీధర్, డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీఈవో రాజ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

భాగస్వామ్య విధానంతో అభివృద్ధి సాధ్యం

భాగస్వామ్య విధానంతో సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. ఆదికర్మయోగి కార్యక్రమం నిర్వహణపై శనివారం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 113 గ్రామ సచివాలయాల పరిధిలో 165 గ్రామాలను మొదటి విడతలో ఎంపిక చేశామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ తెలిపారు. పీఎం జన్‌మన్ పీవో రిషబ్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరం

● డీఎంహెచ్‌వో భాస్కరరావు


అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

బెలగాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో శనివారం డీసీహెచ్ ఎస్ డా.నాగభూషణరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిపాలు ప్రాముఖ్యతను తెలియజేశారు. బిడ్డ ఆరోగ్యకర ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, విటమిన్లు తల్లి పాలల్లో ఉంటాయన్నారు. ఇమ్యూనోగ్లోబ్యులిన్స్, లింఫోసైట్స్ రోగనిరోధక వ్యవస్థను బలపరిచి పిల్లలు వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయని తెలిపారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించాలని.. ఇవి మొదట సహజ టీకా అని వెల్లడించారు. దీనివల్ల తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ నెల 7వరకు తల్లిపాలు వారోత్స వాలు కొనసాగించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని వైద్య అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ సదస్సులో డీఐవో విజయమోహన్, జిల్లా ప్రోగ్రాం అధికారులు జగన్మోహన్‌రావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండేలా!

● ప్రతి 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ● ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు

● ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు

సాలూరు,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్లు వారికి సమీపంలో సౌకర్యవంతంగా.. ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో చర్చిస్తున్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. 1200 మంది ఓటర్లకు ఒక కేంద్రం అదీ దగ్గరగా ఉండేలా ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో 1200 మందిపైబడి ఓటర్లు ఉంటే సమీప కేంద్రాల్లోకి చేర్చడం, లేదా కొత్తగా మరో కేంద్రం ఏర్పాటు చేయడం, ప్రస్తుత కేంద్రం ఇబ్బందికరంగా ఉంటే తొలగించి మరోచోట ఏర్పాటు చేసే సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు అధికారులు తీసుకుంటున్నారు. అందుకుగానూ నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు తీసుకొని వాటిపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభ్యంతరాలు తీసుకుంటున్నారు. ఓటర్లకు కూడా పోలింగ్ కేంద్రాల మార్పు, చేర్పులపై అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం 1200 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఉండడంతో ఓటు హక్కు వినియోగానికి ప్రజలు ఎక్కువ సేపు వేచి చూడాల్సి వస్తోంది. చాలా దూరం నుంచి పోలింగ్ కేంద్రానికి రావాల్సి ఉంటుంది. తాజాగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో 46 కేంద్రాల్లో మార్పులు జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం మన్యంలో 1032 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పాలకొండ నియోజకవర్గంలో 287 కేంద్రాలు ఉండగా 1200 ఓటర్లలోపు ఉన్న కేంద్రాలు 267, అంతకుమించి ఓటర్లు ఉన్న కేంద్రాలు 20 వరకూ ఉన్నాయి. పార్వతీపురంలో 233 కేంద్రాలు ఉండగా 1200 ఓటర్ల లోపు 223 , అంతకుమించి ఓటర్లు ఉన్న కేంద్రాలు 10 వరకూ ఉన్నాయి. కురుపాంలో (మిగతా 8వ పేజీలో...)


సాలూరులో ఓ పోలింగ్ కేంద్రం

పలు పీఏసీఎస్‌ల్లో ప్రత్యేకాధికారుల
పాలన పొడిగింపు

పార్వతీపురం/పాలకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ప్రత్యేక అధికారుల పాలనను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పలు మండలాల్లో పీఏసీఎస్‌లకు నాన్ అఫీషియల్ కమిటీలను నియమించారు. అయితే భామిని, పాలకొండ, వీరఘట్టం, గరుగుబిల్లి, పార్వతీపురం, సీతానగరం తదితర మండలాల్లో పీఏసీఎస్‌ల ప్రత్యేకాధికారుల పాలనను మరో ఆరు నెలల పాటు పొడిగించారు.

బోధనా నైపుణ్యాలు
పెంచుకోవాలి

● డీఐఈవో నాగేశ్వరరావు

బెలగాం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలని డీఐఈవో వై.నాగేశ్వరరావు సూచించారు. శనివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓరియంటేషన్ తరగతులు (మిగతా 8వ పేజీలో...)


మాట్లాడుతున్న డీఐఈవో

గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు
జర్మన్ భాషపై ఉచిత శిక్షణ

● 7వరకు దరఖాస్తుల స్వీకరణ

● గిరిజన సంక్షేమశాఖ డీడీ కృష్ణవేణి

8లో

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

8లో

● సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపు

పర్యాటక కేంద్రంగా పెద్దగెడ్డ

● మంత్రి సంధ్యారాణి

● జలాశయం నుంచి సాగునీరు విడుదల

● పాచిపెంట- అరకు రోడ్డు పూర్తికి చర్యలు

6లో

స్నేహమేరా జీవితం

- ఒకరికొకరు తోడుగా సాగుతున్న మిత్రులు
- మైత్రీ బంధానికి నిదర్శనంగా నిలుస్తున్నది ఎందరో
- నేడు స్నేహ దినోత్సవం



స్నేహమంటే ఇద్దరు మనుషులు.. రెండు మనసుల అనుబంధానికి చిహ్నం. కుల మతాలకు... ప్రాంతాలకు అతీతమైనది స్నేహబంధం. బంధుత్వాల కంటే పదునైన ది మైత్రీ బంధం. చిన్నప్పటి నుంచి ఒకేమాట.. ఒకే బాటగా నిలుస్తున్న వారు ఎందరో ఉన్నారు. అదీ స్నేహం గొప్పతనం. ఇక బృందాలుగా ఉంటూ.. తమ మిత్రులతో పాటు తోటివారికి సాయ పడుతున్న నేస్తాలూ ఉన్నారు. వీరంతా మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మల్లమ్మపేట ముగ్గురు మిత్రులు..



ఇంటి గోవిందరావు, పట్నాయకుని వెంకటవేణుగోపాలరావు, తెంటు రామ్మోహనరావు

బొబ్బిలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని మల్లమ్మపేట గ్రామానికి చెందిన వ్యక్తులను అందరూ ముద్దుగా మల్లమ్మపేట ముగ్గురు మిత్రులు అని పిలుస్తుంటారు. వారిలో ఇద్దరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఒకరు మున్సిపల్ కౌన్సిలరు. ఇంటి గోవిందరా వు కౌన్సిలరుగా.. పట్నాయకుని వెంకట వేణుగోపాలరావు పోస్టుమాస్టర్‌గా, తెంటు రామ్మోహనరావు బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు 1983లో స్థానిక సంస్థానం హైస్కూలులో పదో తరగతి చదివిన నాటి నుంచి మిత్రులు. వారి ఇళ్లలో ఏ కార్యక్రమాలు జరిగినా ముగ్గురూ కలిసికట్టుగా చేయాల్సిందే. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్థానిక రైల్వేస్టేషన్ వద్ద సమావేశమై సరదాగా కబుర్లు చెప్పుకోవడం వారికి అలవాటు. ఎవరైనా కష్టాల్లో ఉన్నారంటే తోచిన సాయం చేస్తుంటారు. సుమారు 40 ఏళ్ల నుంచి వీరి మైత్రీ బంధం సాగుతోంది. ఈ ముగ్గురికి ఒక్కొక్కరే ఆడపిల్లలు. వారు కూడా తమ తండ్రుల మాదిరిగా మంచి స్నేహితులుగా మెలుగుతుండడం విశేషం. స్నేహానికి కులం, మతం, సామాజిక హోదాలు ఏవీ అడ్డురావని వారు చెబుతారు. కుటుంబ సభ్యులతో పాలు పంచుకోని అంశాలను సైతం స్నేహితులుగా చర్చించుకుంటామని వారు తెలిపారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మించిన మైత్రీ వేదిక

మతం కన్నా.. మైత్రి గొప్పదని

బొబ్బిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి చెందిన మూడు మతాలకు చెందిన ముగ్గురు మిత్రులు ఆదర్శంగా నిలుస్తున్నారు. చిరుప్రాయం నుంచి చిన్నపాటి దుకాణాలలో పని చేసుకునేటప్పుడు.. సెకెండ్ షో సిని మాలతో మొదలైన బంధం... కష్టాలలో పాలు పంచుకుంటూ.. అవసరంలో ఉన్న వారికి ఆదుకునే వరకూ ఎదిగింది. వారే స్థానిక భూముల వీధికి చెందిన చీమల అచ్యుతరావు, ఐటీఐ కాలనీకి చెందిన చింతాడ అబ్రహం అలియాస్ అప్పారా వు, కోరాడవీధికి చెందిన ఎస్కే సలీంలు. వేర్వేరు మతాలకు చెందిన ఈ ముగ్గురి దీ మూడున్నర దశాబ్దాల అనుబంధం. ఈ ముగ్గురు పది పన్నెండేళ్ల వయస్సు లో చదువుకుంటూనే చిన్నపాటి వ్యాపార సంస్థల్లో పనిచేసేవారు. అచ్యుతరావు ఓ పాన్‌షాపులో, అబ్రహం అలియాస్ అప్పారావు టీ కొట్టులో, సలీమ్ స్వీటు స్టాల్‌లో పనిచేసేవారు. ఈ షాపులు స్థానిక పాతబస్టాండులోని ఒకే కూడ లిలో ఉండేవి. దీనితో వీరికి ఒకరితో ఒకరికి పరిచయమై... స్నేహబంధం గా స్థిరపడింది. ఈ ముగ్గురూ సినీ హీరో నందమూరి బాలకృష్ణ అభిమా నులు కావడం విశేషం. ప్రస్తుతం అచ్యుత పాతబస్టాండులో పాన్ షాపు.. అబ్రహం ఐటీఐ కాలనీలో పాన్‌షాపు, సలీం స్వీటుషాపులను నడుపుతూ కుటుంబ పోషణ చేసుకుం టున్నారు. అచ్యుతకు భార్య ఇద్దరు మగ పిల్లలు, అబ్రహంకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు, సలీంకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

పూర్వ జన్మ బంధంగా భావిస్తాం..

మా ముగ్గురిది పూర్వ జన్మ బంధమ నుకుంటూ ఆనందిస్తుంటాం. మా మధ్య ఎటువంటి అరమరికలు ఉండవు. ఏకాభి ప్రాయంతో ముందుకు సాగుతున్నాం. ఏ కష్టమొచ్చినా... నష్టమొచ్చినా ముగ్గురం కలిసిమెలిసి చర్చించుకుంటూ పరిష్క రించుకుంటాం. బాలయ్య జన్మదినోత్స వాలు, సినిమా విడుదల వేడుకల్లో... అన్నదానం, రక్తదానం వంటి సేవా కార్య క్రమాల్లో ముగ్గురం ఉత్సాహంగా పా ల్గొంటాం. అల్పాదాయవర్గాల వారకైనా సేవల్లో సంపన్నులం.

-అచ్యుతరావు, అబ్రహం, సలీమ్



బొబ్బిలికి చెందిన ముగ్గురు మిత్రులు చీమల అచ్యుతరావు, చింతాడ అబ్రహం, ఎస్కే సలీం

స్నేహ బృందం... సేవా ప్రయాణం

- 45 ఏళ్లుగా కలిసి నడుస్తున్న మిత్రులు



పుర్వ విద్యార్థి మిత్రులు

రాజాం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979-89 మధ్య పదేళ్ల పాటు చదువుకున్న వారంతా 2004లో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ పేరుతో సంఘంగా ఏర్పడ్డారు. సుమారు 45 ఏళ్ల క్రితం కలిసిన వారంతా రాజాంతో పాటు దేశంలోని విభిన్న ప్రాంతాలలో వివిధ స్థాయిల్లో స్థిరపడ్డారు. అయినా..ఇప్పటికీ వారి బంధం అలాగే కొనసాగు తోంది. సుమారు 120 మంది స్నేహితుల్లో ఏటా 80 మంది వరకూ రాజాంలో కలుస్తుంటారు. మిత్రుల కష్టసుఖాల్లో భాగస్వాములవుతున్నారు. ఓ మిత్రుడు ఆకస్మికంగా మరణించడంతో అతని కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించారు. అ దే స్ఫూర్తితో సేవలకు శ్రీకారం చుట్టారు. మిత్ర బృందంలో ప్రస్తుత ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్ కు మార్, ఇ.ఎన్.టి. వైద్యులు పి.ఎల్.ఎన్.రాజు, (రఘు), బి.వి.అచ్యుత కుమార్ తదితరుల సార థ్యంలో మిగిలిన సభ్యులందరూ గత 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గతేడాది నవంబరు 9, 10 తేదీలలో రాజాంలో రీ యూని యన్ పేరిట దేశంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చి రెండు రోజుల పాటు భవిష్యత్ కార్యక్రమా లపై ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.4 లక్షల వ్యయంతో మైత్రీ వేదికను నిర్మించారు. ఈ వేదిక ను స్నేహితుల దినోత్సవం రోజున ప్రారంభించ నున్నారు. ఈ స్నేహితులు సేవా కార్యక్రమాలతో మైత్రీ బంధానికి కొత్త అర్థం చెబుతున్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా...

- రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదు వుతున్న తల్లిదండ్రులు లేని విద్యార్థులకు రెండు దశాబ్దాలుగా యూనిఫారాలు అందజేస్తున్నారు.
- 2005 నుంచి 2016 వరకూ 11 ఏళ్లపాటు పదో తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు రూ.5వేలు, 3వేలు, 2 వేలు వంతున అందజేశారు.
- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటి కుళాయి ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలోని కళాభారతి ఆడిటోరియం పునర్నిర్మించారు.
- 2014లో కొత్తగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.60 వేల విలువ చేసే మెటీరియల్ అందజేశారు.
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ అయిదేళ్లుగా ట్రావెల్ బ్యాగులు అందజేస్తున్నారు. ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఈ మిత్ర బృందం ఎంతోమంది ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.

పర్యాటక కేంద్రంగా పెద్దగెడ్డ

- రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): ఆహ్లాదకర వాతావర ణం... పచ్చని చెట్లతో ఉన్న పెద్దగెడ్డ ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తా నని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె పెద్దగెడ్డ జలాశయం నుంచి సాగునీరు విడుదల చేశారు. దీని పూర్తి స్థాయి సామర్థ్యం 213.8 మీటర్లు కాగా... ప్రస్తుతం 212.30 మీటర్లు నిల్వ ఉంది. స్పిల్‌వే ద్వారా 15 క్యూసెక్కులు, ప్రధాన కుడి కాలువ ద్వారా 30 క్యూసె క్కులు విడుదల చేశారు. అవస రమైన ప్రాజెక్టుల వద్ద పర్యాటక కేంద్రాలు ఏర్పాటు చేయడం ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యమన్నారు. పాచిపెంట-అరకు రోడ్డును పూర్తి చేసి పర్యాట కులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జైకా నిధులు మంజూరైనప్పటికీ గత ప్రభుత్వ హయాంలో కాలువ లైనింగ్, ఆధునికీకరణ పనులు జరగలేదన్నారు. రైతుల అవసరాల దృష్ట్యా రూ. 20 లక్ష లు మంజూరు చేసి పూడికతీత పను లు చేయించామన్నారు. సరైన సమ యంలో సాగునీరు విడుదల చేశామని చెప్పారు. అత్యధిక రహదారుల నిర్మా ణం వల్ల డోలీ మోతలు తగ్గాయని... త్వరలో పూర్తి స్థాయిలో రహదారులు నిర్మిస్తామన్నారు. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నా వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. రాష్ట్రమంతటా ఉచిత బస్సు సౌకర్యం కల్పించే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారా యణ, టీడీపీ మండల అధ్యక్షులు గూడేపు యుగంధర్, నాయకులు పల్లేడ వెంకటరమణ, పిన్నింటి ఈశ్వరరావు, మతల బలరాం, కొత్తల పోలినాయుడు, చల్లా కనకబాబు, పెద్దగెడ్డ ప్రాజెక్టు చైర్మన్ గుంద్రోతు పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెద్దగెడ్డ జలాశయం నుంచి నీరు విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

అపురూపం.. అక్కాచెల్లెళ్ల బంధం

- నేడు సిస్టర్స్ డే

మన జీవితంలో అమ్మానాన్నల తరువాత అత్యంత ముఖ్యమైన వారు తోబుట్టువులు. ఆటపాటల్లోనే కాదు.. కష్టసుఖాల్లోనూ తోడుగా నిలిచేది తోబుట్టువులే. ఇక అక్కచెల్లెళ్ల బంధం కోసం ఎంత చెప్పినా తక్కువే. అన్న దమ్ములు విడిపోయిన సందర్భాల కంటే.. అక్కచెల్లెళ్లు విడిపోయే సందర్భాలు చాలా తక్కువ. తమ తోబుట్టువులకు అమ్మ పాత్ర పోషించిన అక్కచెల్లెళ్లు ఎందరో ఉన్నారు. అమ్మానాన్నలతో పంచుకోలేని అనేక విషయాలను అక్కచెల్లెళ్లతో పంచుకుంటారనడంలో సందేహం లేదు. నేడు సిస్టర్స్ డే సందర్భంగా అలాంటి కొందరు అక్క చెల్లెళ్లను ఓసారి చూద్దాం.

ఆ నలుగురు.. ఆదర్శంగా

బొబ్బిలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాహితీ నగర్‌కు చెందిన వంగపండు అమ్మాజీ గాదెలవలస జెడ్‌పి హైస్కూలులో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమెతో పాటు మొత్తం నలుగురు అక్కాచెల్లెళ్లు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయినిలు కాగా, ఇద్దరు గృహిణిలు. అమ్మాజీ పెద్ద చెల్లెలు రమాదేవి పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పాలిటెక్నికల్ డిప్లమో చేసిన ఇంకో చెల్లెలు మూడడ్ల లలిత, బీటెక్ చదివిన ఆఖరి చెల్లెలు చప్ప భారతి తమ కుటుంబాలతో విశాఖలో నివాసం ఉంటున్నారు. వీరి తండ్రి వంగపండు కృష్ణారావుది బలిజిపేట మండలం గంగాడ స్వగ్రామం. ఆయన జడ్పీ హైస్కూలు హెచ్ఎంగా పనిచేసి రిటైరయ్యారు. ఆయనకు నలుగురూ ఆడపిల్లలే. ఆ నలుగురు అక్కాచెల్లెళ్లు ఎంతో అనురాగంతో కలసిమెలసి ఉంటున్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలుస్తున్నారు.



సోదరీమణులతో అమ్మాజీ

అమ్మను చూసుకుంటారు..

ఓ మారుమూల గ్రామంలో పుట్టిన మాకు నాన్న విద్యాబుద్ధులు, సంస్కారాన్ని అందించారు. తల్లిదండ్రు లు చనిపోయినా వారి జ్ఞాపకాలతో మేమంతా చాలా ఆనందంగా ఉన్నాం. ఒకరికొకరు ఎంతో ప్రేమాభిమానా లను పంచుకుంటుంటాం. ఏటా ఒక్కో ఇంటి దగ్గర పండుగలు, పబ్బాలు చేసుకుంటాం. నేను పెద్దదానిని కావడంతో నా చెల్లెళ్లు నన్ను అమ్మలా గౌరవిస్తుంటారు. కష్టసుఖాలను... సరదాలను అన్నీ పంచుకుంటాం.

-వంగపండు అమ్మాజీ, ఉపాధ్యాయిని, బొబ్బిలి

ఆత్మీయతకు చిహ్నంగా..

బొబ్బిలి పట్టణంలోని వ్యాపారి సుంకరి మన్మథరావు కు నలుగురు కుమార్తెలు. ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమార్తె నారంశెట్టి సుజాత బొబ్బిలిలో, సింగిశెట్టి రమాదేవి బలిజిపేటలో, నారంశెట్టి భానుమతి పూణేలో ఉండేవారు. ఆమె కన్నుమూశారు. నారంశెట్టి కన్యాకు మారి హైదరాబాద్‌లో ఉంటున్నారు. తన అక్కలు ఎం తో అన్యోన్యంగా ఉంటారని తమ్ముడు సాయిరమేష్ చెబుతున్నారు. తల్లిదండ్రులు మన్మథరావు, జయలక్ష్మి 80 ఏళ్ల వయస్సులో ఆరోగ్యంగా ఉంటూ... తమ అంద రికీ నిండుమనసుతో ఆశీర్వచనాలు అందజేస్తుండడంతో తోబుట్టువులతో సంతోషంగా ఉంటున్నామని తెలిపారు.



ఇద్దరు తమ్ముళ్లతో మన్మథరావు కుమార్తెలు

15 వరకు హర్ ఘర్ తిరంగా

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేలా జిల్లా అంతటా ఈ నెల 2 నుంచి 15 తేదీ వరకూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల నోడల్ అధికారిగా జిల్లా పర్యాటక శాఖాధికారిని నియమించినట్టు వెల్లడించారు. ఈ నెల 8 వరకూ అన్ని విద్యా సంస్థలలో జరుగుతాయని తెలిపారు. 9 నుంచి 12 తేదీ వరకూ తిరంగా మహోత్సవ్ పేరుతో ప్రజా ప్రతినిధులు, వీఐపీలతో కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 13 నుంచి 15వ తేదీ వరకూ ప్రభుత్వ భవనాలు, హోటళ్లు, వంతెనలు, డ్యాంలను విద్యుదీకరించి.. జాతీయ జెండాలను ఎగుర వేయనున్నట్టు వివరించారు.

తల్లి పాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ..

బిడ్డ పుట్టిన గంట లోపే తల్లిపాలను అందించాలని. ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా అని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. శనివారం తన చాంబర్‌లో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జిల్లా వైద్యాధికారి జీవనరాణి, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ దేవి మాధవి తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ అంబేద్కర్

దుర్భిలిలో ఏనుగుల బీభత్సం

- పొలాల్లోని షెడ్లను ధ్వంసం చేసిన గజరాజులు
- భయాందోళనలో గిరిజనులు

కురుపాం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కురుపాం సమీపంలోని దుర్భిలి, మంత్రజోల పరిసరాల్లో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. మూడు రోజులుగా తొమ్మిది ఏనుగులు రైతులు పొలాల్లో వేసుకున్న షెడ్లు, పాకలను ధ్వంసం చేస్తున్నాయి. మూలిగూడ జంక్షనులో తోయిక నగేష్ అనే గిరిజనుడికి చెందిన షెడ్‌ను ధ్వంసం చేశాయి. రైతు భద్రపరచుకున్న 3 బస్తాల ధాన్యం విత్తనాలను ధ్వంసం చేసాయి. దుర్భిలి గ్రామానికి చెందిన తోయిక ఇనత్, పువ్వల త్రినాథరావు, తోయిక కస్తూరి తదితర రైతులకు చెందిన వరినారు మళ్లు, పొలాల గట్లపై వేసిన అరటి చెట్లను ధ్వంసం చేశాయి. మంత్రజోల గ్రామానికి చెందిన జీలకర్ర జట్టు, దేవు, లారి అనే వ్యక్తుల వరి నారు మళ్లను ఏనుగులు పాడుజేశాయి. మూలిగూడ జంక్షన్ నుంచి దుర్భిలి గ్రామానికి వెళ్లే రహదారి పరిసరాల్లో ఏనుగులు తిష్ట వేశాయి అటవీ శాఖ అధికారులు సాయి కృష్ణ, నగేష్ కుమార్‌లు అప్రమత్తమై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగుల సమస్యకు పరిష్కారం చూపాలని బియ్యాలవలస సర్పంచ్ పువ్వల అజారి కోరుతున్నారు.



దుర్భిలి సమీప తోటల్లో ఉన్న ఏనుగులు

వార్డు పరిపాలనా కార్యదర్శులకు మెమోలు

విజయనగరం టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగర పాలక సంస్థలో ఆస్తిపన్ను వసూళ్లు, డిమాండ్ జనరేషన్, పన్నుల విధింపునకు సంబంధించి చేర్పులు, మార్పులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు పరిపాలన కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం సాయంత్రం మెమోలు జారీ చేశారు. వారానికి రూ.లక్ష చొప్పున ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినా పట్టించుకోని 54 మంది కార్యదర్శులకు, కొత్తగా పన్నులు వేసేందుకు భవనాలను గుర్తించని మరో 54 మంది కార్యదర్శులకు, ఆస్తిపన్నులో చేర్పులు, మార్పులు చేయడంలో నిర్లక్ష్యం వహించిన 56 మంది కార్యదర్శులకు మెమోలను జారీ చేశారు. నగరపాలక సంస్థలో పారదర్శకంగా సేవలు అందించడంతో పాటు ఆదాయ సముపార్జనలో శ్రద్ధ వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఎప్పటికప్పుడు కార్యదర్శులను ఆదేశిస్తున్నారు. అయినప్పటికీ కొంతమంది కార్యదర్శులు కమిషనర్ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. సచివాలయాల పరిధిలో కార్యదర్శులు సక్రమంగా పనిచేయడం లేదని కమిషనర్ గుర్తించారు. ఈ నేపథ్యంలో సంజాయిషీ కోరుతూ మెమోలు జారీ చేశారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు..

నగర పాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లనయ్య హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు పరిపాలనా కార్యదర్శులకు మెమోలు జారీ చేశామన్నారు. బాధ్యతాయుతంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఈ నెలఖరు నాటికి 50 శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని స్పష్టం చేశామన్నారు.

గొరడలో ఆదివాసీ దినోత్సవం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరడ గ్రామంలో శనివారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గిరిజన చట్టాలను సక్రమంగా అమ లు చేయడానికి నాయకులు కృషి చేయాలని కోరారు. హక్కుల సాధనకు గిరిజ నులు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. అనంతరం గిరిజనులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు మండంగి రమణ, గిరిజన సాంస్కృతిక పరిరక్షణ సభ్యులు స్వామి మాస్టార్, నాయకులు తాడంగి జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న గిరిజనులు

బళ్లారి రాఘవ సేవలు నిరుపమానం

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యసించిన బళ్లారి రాఘవ లాయర్‌గా ఉంటూ... తాను సంపాదించినదంతా నాటకరంగం కోసం త్యాగం చేశారని డీఆర్వో శ్రీనివాసమూర్తి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం బళ్లారి రాఘవ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టరు కళావతి, జిల్లా పర్యాటక అధికారి కుమార స్వామి తదితరులు ఉన్నారు.



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

రేపటి తరాన్ని కాపాడుకుందాం

రేగిడి, ఆగస్టు 2, (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించి, రేపటి తరాన్ని కాపాడుకుందామని రేగిడి ఎస్ఐ నీలావతి, ఎంఈవో వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం వారి ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులు స్థానిక పోలీస్‌స్టేషన్, ఉంగరాడమెట్ట కూడలిలో ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఖండ్యాం, రేగిడి, ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ కావాలన్నదే లక్ష్యం


భాస్కరరావు

రాజాం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ కావాలన్నదే తన ముందున్న ప్రధాన లక్ష్యమని మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన పాలవలస భాస్కర రావు తెలిపారు. ఈనెల 1న విడుదలైన కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో రాష్ట్రంలో 9వ ర్యాంకు సాధించిన భాస్కరరావు సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరి విధులు నిర్వహిస్తూ లక్ష్యాన్ని సాధిస్తానని ఆయన వెల్లడించారు. భాస్కర రావు రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించి, ఉద్యోగం పొందడంతో తల్లిదండ్రులు సీతారాం, జయమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

హామీలు అమలు చేయాలి

● మాజీ మంత్రి బొత్స

మెరకముడిదాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గర్భాం గ్రామంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన వైసీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బెల్లాన చంద్రశేఖర్, ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి, చెల్లి మీద కేసులు వేసిన వ్యక్తి జగన్

శృంగవరపుకోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తల్లి, చెల్లి మీద కేసులు వేసిన వ్యక్తి మాజీ సీఎం జగన్ అని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం ఎల్.కోటలోని క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మహిళా ప్రజా ప్రతినిధిని నీచంగా మాట్లాడిన ప్రసన్న కుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన జగన్‌కు నైతిక విలువలు ఉన్నాయా.. అని ఆమె ప్రశ్నించారు. భారతీరెడ్డి మాటలకు, చేతలకు అస్సలు సంబంధం లేదన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

రాజాం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్ట్ దిగ్గజం, కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ అచ్యుతానందన్ తన జీవితాన్ని ప్రజా పోరాటాలకే అంకితం చేశారని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు తెలిపారు. అచ్యుతానందన్ వర్ధంతి సందర్భంగా శనివారం కంచరాం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం పెరగాలి

గరివిడి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస అన్నారు. గరివిడిలో గల డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కె.మురళి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై ఫిర్యాదు

లక్కవరపుకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరతపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి పలువురు నాయకులు, రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుత సీజన్‌లో యూరియా కొరత రైతులను వేధిస్తోందని, వర్షాలు ఎక్కువ కురిస్తే పరిస్థితులు దారుణంగా ఉంటాయని తెలిపారు. నియోజకవర్గంలో ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆమె వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇండెంటు పెట్టామని రెండు రోజుల్లో వస్తుందని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సరఫరాకు సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

కొత్తవలస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బాలికలను ఇబ్బంది పెడితే ధైర్యంగా ఫిర్యాదులు చేయాలని కొత్తవలస సీఐ షణ్ముఖరావు సూచించారు. అర్దానపాలెం మోడల్‌స్కూల్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తరగతి గదిలోనూ శక్తి వారియర్స్ టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ ఫీడర్ నందు నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ త్రినాథరావు తెలిపారు. కలెక్టర్ ఆఫీస్ ఏరియా, ఎస్పీ కార్యాలయం, పోలీస్ బారెక్స్ ఏరియా నందు విద్యుత్ ఉండదని చెప్పారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

శృంగవరపుకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట శాఖా గ్రంథాలయానికి స్థానికుడు మోపాడ శేషు రూ.15వేలు విలువ చేసే పుస్తకాలు వితరణ చేశారు. శనివారం వీటిని గ్రంథాలయ అధికారి శ్రీధర్‌కు అందించారు.

రైతన్నలకు అండగా..

● అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల

● కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు


రాజాం: చంద్రబాబు చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు


చీపురుపల్లి: అన్నదాత సుఖీభవ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు


లక్కవరపుకోట: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

రైతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యేలు అన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో భాగంగా శనివారం రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేశారు. ఈసందర్భంగా జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొని, చెక్కులను పంపిణీ చేశారు.

హామీల అమలుకు సీఎం కృషి

రాజాం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్‌లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. మొదటి విడతలో భాగంగా రూ.7వేలు చొప్పున ఒక్క రాజాం నియోజకవర్గంలో రైతుల ఖాతాల్లో రూ.26.8 కోట్లు జమయ్యాయన్నారు. ఏడీ కె.చంద్రరావు, ఏవో చీకటి రఘునాథ్, బొత్స వాసుదేవరావునాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేశారు.

సూపర్‌సిక్స్ అమలు చేస్తున్నారు

చీపురుపల్లి (గరివిడి): సూపర్‌సిక్స్ పథకాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. చీపురుపల్లి మండలం పీకే పాలవలస గ్రామంలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో మొదటి విడతలో 36,916 మంది రైతుల ఖాతాల్లో రూ.24కోట్ల 32లక్షల పెట్టుబడి సాయాన్ని జమ చేశారని తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్.కోటకు రూ.27కోట్ల 53లక్షలు

లక్కవరపుకోట: చంద్రబాబు ప్రభుత్వం రైతులకు అండగా ఉందనడానికి అన్నదాత సుఖీభవ పథకమే నిదర్శనమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మండల కేంద్రంలో ఏవో హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఆమె అన్నదాత సుఖీ భవ-పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 41వేల మంది రైతులకు రూ.27కోట్ల 53లక్షల 40వేలు జమ అయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు వెబ్‌ల్యాండ్ డాటా ప్రకారం పేర్లు వచ్చాయని, సుమారు 2వేల మంది వివిధ కారణాలతో పెండింగ్ ఉందని ఏడీఏ భానులత తెలిపారు. రాష్ట్ర టూరిజం డైరెక్టర్ సుధారాణి, ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, సర్పంచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సుభిక్షంగా రైతులు

డెంకాడ: అన్నదాత సుఖీభవతో రాష్ట్రంలోని రైతులు సుభిక్షంగా, ఆనందంతో ఉన్నారని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏవో సంగీత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు వ్యవసాయాన్ని వ్యాపారపరంగా చేయాలన్నారు. విజయనగరం డివిజన్ ఏడీఏ నాగభూషణరావు, ఎంపీపీ బి.వాసుదేవరావు, తహసీల్దార్ రాజారావు, ఎంపీడీవో భవాని, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లి భాస్కరరావు, కాగితాల సత్యనారాయణరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


డెంకాడ: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

విజయనగరం కల్చరల్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. నగర శివార్లలోని చెల్లూరు గ్రామంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తుందన్నారు. తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్, విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి పాలవలస యశస్వి, విజయనగరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్రోతు నర్సింగరావు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

నెల్లిమర్ల: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా సత్తివాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్టీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు వెంకటరమణ, అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో సుపరిపాలనలో తొలి అడుగు

విజయనగరం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నగరంలోని 38, 39, 43, 44 డివిజన్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. పనిచేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. మండల పరిధిలోని కోరుకొండ గ్రామంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు

12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

మెరకముడిదాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు కోరారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు 3శాతం పెండింగ్ డీఏలను ప్రకటించాలని, డీఏ బకాయిలను, 11వ పీఆర్ బకాయిలను, సరండర్ లీవు బకాయిలను చెల్లించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలని, 72,73,74 జీవోలు అమలు చేయాలని కోరారు. అంతర్ జిల్లాల బదిలీలను చేపట్టాలని, సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి గ్రేడ్-2 పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలన్నారు.

తిరుమలాచార్యుల మృతి సాహిత్య రంగానికి తీరని లోటు

విజయనగరం బాబామెట్ట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, సాహితీవేత్త తిరుమలాచార్యుల మృతి సాహిత్య రంగానికి తీరని లోటని తెలుగు భాష పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, డాక్టరు జక్కు రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక గురజాడ అప్పారావు స్వగృహంలో సమితి ఆధ్వర్యంలో తిరుమలచారి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంతో మంది విద్యార్థులకు చదువుకునేందుకు సాయం చేశారని అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా తెలుగు సాంస్కృత సాహిత్యాల్లో విశేష సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు నారాయణమూర్తి, సుభద్రా దేవి, శ్రీనివాస్, రఘునందన్, సూర్యలక్ష్మి, వెంకటేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరంలోని గాజులురేగ సచివాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మిక రంగానికి తీవ్ర నష్టం

నెల్లిమర్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు కార్మికులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల భవనంలో ఐఎఫ్‌టీయూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో లేబర్ కోడ్‌లపై వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.గీత.. శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

సీతంపేట ప్రత్యేక పంచాయతీగా ఆమోదం

శృంగవరపుకోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పంచాయతీ శివారు సీతంపేట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక పంచాయతీగా ఆమోదం తెలిపేందుకు ఎంతమంది సముఖంగా ఉన్నారో చేతులు ఎత్తాలని సభ్యులను కార్యనిర్వాహక కార్యదర్శి వీవీ అనురాధ కోరారు. దాదాపుగా సమావేశానికి వచ్చిన సభ్యులంతా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు అంగీకారం తెలుపుతూ చేతులు ఎత్తారు. ఎస్.కోట మేజర్ పంచాయతీలో భాగంగా ఉన్న ఈ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా మారిస్తే అభివృద్ధి చేసుకుంటామని చెప్పారు. సభ్యులు చేసిన తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

పూసపాటిరేగ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఈ సమావేశానికి ఎంపీపీ మహంతి కళ్యాణి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ చాలామంది లబ్ధిదారులకు తల్లికి వందనం సొమ్ము అందలేదన్నారు. కొందరికి రూ.11 వేలు, కొందరికి రూ.13వేలు జమ అవటానికి కారణం ఏంటని ప్రశ్నించారు. దీనిపై విద్యాశాఖకు ఎటువంటి సమాచారం లేదని ఎంఈవో బదులిచ్చారు. జలజీవన మిషన్ కింద కుళాయిలు వేశారు గానీ ఎక్కడా నీరు అందజేయలేదని సభ్యులు దుయ్యబట్టారు. కొప్పెర్లలో అంగన్‌వాడీ కార్యకర్త గానీ, ఆయా గానీ లేరని, వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు కోరారు. విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ దేవుడు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఎన్నో సమస్యలు పరిష్కరించారంటూ అన్ని పార్టీల సభ్యులు ప్రశంసించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాధిక, తహసీల్దార్ ఎస్‌వీ రమణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుడు బళ్లారి రాఘవ

విజయనగరం క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రంగానికి విశేష సేవలు అందించి. నాటక రచనలతో సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు బళ్లారి రాఘవ అని జిల్లా అదనపు ఎస్పీ సౌమ్యలత అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ బళ్లారి ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, రాజకీయ నాయకుడిగా, విభిన్న రంగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం బళ్లారి రాఘవకు రావు బహదూర్ బిరుదును ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్, ఏవో శ్రీనివాసరావు, రామకృష్ణ, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ● విజయనగరం రింగురోడ్డు: నాటకరంగానికి పితామహుడుగా బళ్లారి రాఘవ పేరు గాంచారని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా విజయనగరంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, టీపీఆర్వో సింహాచలం, మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరాజు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


విజయనగరం క్రైం: బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత


విజయనగరం రింగురోడ్డు: నివాళులు అర్పిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లి పాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ నూకలమ్మ, లింగాలవలస ఏఎన్ఎం కె.రాణి అన్నారు. శనివారం వావిలవలస అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆశా కార్యకర్త సరస్వతి, సీసీ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ● గరివిడి: మండలంలోని గెడ్డపువలస, కాపుశంభం, కోనూరు, చుక్కవలస, బొండ పల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాలపై అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.జ్యోతి, శకుంతల, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ● రాజాం: గారాజు చీపురుపల్లి గ్రామంలో శనివారం బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సిద్ధేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. వైద్యుడు చరణ్, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ● డెంకాడ: చొల్లంగిపేట పంచాయతీలో శనివారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సర్పంచ్ పోరాడ కనకరాజు తదితరులు పాల్గొన్నారు. ● గుర్ల: తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర అన్నారు. బెల్లాన పేట గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించి, తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


గరివిడి: చుక్కవలసలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

గంజాయి స్వాధీనం

సాలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సాలూరు మీదుగా మల్కనగిరి నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న పలువురిని పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 17 కేజీల 330 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన వివేక్, మల్లిక, ఒడిశాకు చెందిన అంతల్ సీతారాం, మల్కనగిరికి చెందిన సురేంద్ర హ్యాంటల్‌గా గుర్తించారు. వారి వద్ద బ్యాగులో ఉన్న 17 కేజీ 330లు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నలుగురిపై పట్టణ సీఐ అప్పలనాయుడు కేసు నమోదుచేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గంట వ్యవధిలో ఇంటికి..

గజపతినగరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఓ బాలికను గంట వ్యవధిలోనే పట్టుకొచ్చి తల్లికి అప్పగించామని ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమం చేపట్టి పట్టుకున్నామని చెప్పారు. ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం మండలంలోని పురిటిపెంట రైల్వే కాలనీకి చెందిన 15 ఏళ్ల బాలిక ఇంటి నుంచి అదృశ్యం అయినట్టు శుక్రవారం ఆమె తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బాలికను పట్టుకునేందుకు సీఐ జీఏవీ రమణ ప్రత్యేకంగా మూడు బృందాలను ఏర్పాటు చేశారు. పురిటిపెంట ప్రాంతంలోగల పలు సీసీ ఫుటేజీలను పరిశీలించగా, బాలిక మరుపల్లి వైపు వెళ్తున్నట్టు గుర్తించారు. తక్షణమే ట్రేస్ చేసి బాలికను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడుతో పాటు పోలీసు సిబ్బంది పనితీరును ఎస్పీ అభినందించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బాడంగి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వావాడ గ్రామానికి చెందిన బాలిక కనిపించడం లేదని ఆమె తల్లి ఇచ్చి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. గతనెల 29న బాలిక పొలం పనులు చేస్తున్న తల్లి వద్దకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు, చుట్టాలు స్నేహితుల ఇళ్లలో వెదికారు. ఇప్పటికీ ఆచూకీ లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

సంతకవిటి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయ ప్రధాన ద్వారాన్ని విరగొట్టి, స్వామివారి హుండీని అపహరించారు. ఆ హుండీలోని నగదు తీసుకుని, ఖాళీ హుండీని గ్రామ శివారులో పడేశారు. దీనిపై ఆలయ పూజారి జెడ నేతాజీ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 5వ తేదీన స్థానిక మద్యం షాపులో చోరీ జరిగిన సంగతి తెలిసిందే. వరుస చోరీలతో మండల కేంద్ర వాసులు ఆందోళన చెందుతున్నారు.

జ్యూట్ మిల్లు సంఘం మాజీ అధ్యక్షుడు అప్పారావు మృతి

నెల్లిమర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జ్యూట్ మిల్లు శ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు పతివాడ అప్పారావు శనివారం మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. విశాఖలో ఉన్న తన కుమారుడు ఇంటి వద్ద ఉంటూ శనివారం తుది శ్వాస విడిచారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. స్వగ్రామం కొండగుంపాంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతి పట్ల ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ మత్స్య విజయ తదితరులు సంతాపం తెలిపారు.

బీఎస్ఎన్ఎల్‌లో రూపాయికే సరికొత్త ఫ్రీడం ప్లాన్

విజయనగరం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆధ్వర్యంలో సరికొత్త ఫ్రీడం ప్లాన్ కేవలం ఒకే ఒక్క రూపాయితో 30 రోజులు వాలిడిటీ అపరిమిత కాల్స్, రోజుకి 2 జీబీ డేటా, 100 మెసేజ్‌లతో ఉచిత సిమ్‌కార్డు అందించనున్నట్టు బీఎస్ఎన్ఎల్ విజయనగరం ఆపరేషనల్ ఏరియా డిప్యూటీ జనరల్ మేనేజరు దాలినాయుడు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సిమ్ కార్డు కావలసిన వారు బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఎంఎస్‌పీ వినియోగదారులకు కూడా ఈ యాప్ వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివిధ రకాల టారీఫ్‌లను, ప్లాన్‌లను విడుదల చేస్తున్నామని చెప్పారు. నెట్‌వర్క్‌ని కూడా పూర్తిస్థాయిలో విస్తరించామన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

రాజాం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 13న రాజాంలోని కోర్టు సముదాయ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు, మున్సిపాలిటీ, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకుల ప్రతినిధులతో ఆమె వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆమెతో పాటు జూనియర్ సివిల్ న్యాయాధికారి నైమిష ఉన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరువర్గాల అంగీకారంతో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసుల్ని అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్, న్యాయవాదులు జయదేవ్, విజయకుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోలో ఎక్కిస్తే చర్యలు

కొత్తవలస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులను ఎక్కించి తీసుకు వెళ్తే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని కొత్తవలస సీఐ షణ్ముఖరావు హెచ్చరించారు. పాఠశాలల పిల్లలను తీసుకు వెళ్తున్న ఆటో డ్రైవర్లతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. మద్యం తాగి ఆటో నడిపితే లైసెన్సు రద్దు చేసేందుకు ఆర్టీఏ అధికారులకు సిఫారసు చేస్తామని, తాము కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఎంఈవో కార్యాలయానికి చేరిన పుస్తకాలు

రేగిడి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయానికి శనివారం వివిధ పాఠశాలలకు సంబంధించి 18,228 అసెస్మెంట్ పుస్తకాలు చేరాయని ఎంఈవో వరప్రసాదరావు తెలిపారు. వీటిని ఒకటి, రెండు రోజుల్లో అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు.

సమస్యల పరిష్కారానికి చొరవ

● కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



వల్లరిగుడబలో కరపత్రం అందజేస్తున్న జగదీశ్వరి

గరుగుబిల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపించనున్నట్లు కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం మండలంలోని వల్లరిగుడబలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను సర్పంచ్ రౌతు గోవిందరావునాయుడు జగదీశ్వరికి వివరించారు. కలుషిత నీరు కారణంగా ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, తవిటి నాయుడు, అంబటి రాంబాబు, ముదిలిబాబు విజయవాంకుశం, ద్వారపురెడ్డి సత్యనారాయణ, కె.భరత్‌కుమార్, వి.దివాకర్ పాల్గొన్నారు.

మరిన్ని పథకాలకు ప్రణాళిక

పాలకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని, సూపర్‌సిక్స్ ద్వారా ప్రజలకు మరెన్నో సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళిక తయారు చేసి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. శనివారం పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద అర్హత పొందిన 33 మంది వితంతువులకు పింఛన్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ బిడ్డిక సంధ్యా రాణి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, కుమార్‌రాజాగుప్తా పాల్గొన్నారు.

●సీతంపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎస్‌టీవీధిలో 155 స్పౌంజ్ పించన్లను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పంపిణీ చేశారు. కార్య క్రమంలో టీపీసీ మెంబర్ తేజోవతి, పాలకొండ ఏఎంసీ ఛైర్మన్ సంధ్యారాణి, డిప్యూటీ ఎంపీడీవో సత్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అరకు టీడీపీ కార్య నిర్వహక కార్యదర్శి ముదిలిబాబు విజయవాంకుశం తెలిపారు. శనివారం లఖనాపురంలో నూతనంగా మంజూరైన వితంతువు పింఛన్లు అందించారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

సాలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):పాలకొండలో ఈనెల 8,9 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా రెండో మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న కోరారు. శనివారం సాలూరులో బోసుబొమ్మ సెంటర్‌లో ఉన్న బోర్రా చిన్న విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొత్స మోహన్‌రావుతో కలిసి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జీవన్న మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోకి సరైన రోడ్లు లేక ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఏరియా ఆసుపత్రి త్వరలో ప్రారంభం

సాలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సాలూరులో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి త్వరలో ప్రారంభంకానున్నట్లు ఆసుపత్రి ఇంజనీరింగ్ విభాగం ఈఎన్ భారతి, డీఈ నరేంద్రరెడ్డిలు తెలిపారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని శనివారం సాలూరులో కలిశారు. ఆసుపత్రి నిర్మాణం దాదాపుగా పూర్తయిందని, మంత్రి అనుమతిస్తే ప్రారంభంకానుందని వారు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులను గెస్ట్ లెక్చరర్ పద్ధతిలో బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కార్యాలయంలో జిరాక్స్ కాపీలను సమర్పించాలని తెలిపారు. ఈనెల ఆరో తేదీ ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

గరుగుబిల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు రహదారి నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ పి.రమేష్ నాయుడు హెచ్చరించారు. శనివారం మండలంలోని ప్రధాన రహదారుల ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి వాహనాల్లో తరలించరాదని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శంకరరావు, అచ్యుతరావు పాలొల్గన్నారు.

వేతన బకాయిలు ఇవ్వాలి

● ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు డిమాండ్



నిరాహార దీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

బెలగాం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయులకు వెంటనే పొజిషన్ ఐడీ ఇచ్చి బకాయి వేతనాలు చెల్లించాలని ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు డిమాండ్‌చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, బోధనేతర కార్యక్రమం నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బదిలీ చేసినా జీతాలు మాత్రం ఇంతవరకు చెల్లించలేదని, జీతంమీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఉపాధ్యాయులు మూడునెలలుగా ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. ఐడీ నెంబర్ లేకపోవడంతో జీతాలు ఆలస్యం అవుతున్నాయని విద్యాశాఖ మంత్రి అనడం అన్యాయమని, బదిలీ చేసిన వెంటనే ఐడీ నెంబర్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. యాప్‌ల బాధ్యతలు వంటి బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కలిగించి బోధనపైనే తమ బాధ్యతలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, ఐఆర్ ఇవ్వాలని, సరెండర్ లీవ్‌ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకలు ఎస్.మురళీమోహన్, మహేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

రాయగడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాయగడ సమితి కార్యాలయ ప్రాంగణంలో శనివారం సమితిస్థాయి భీమ్‌బోయి దివ్యాంగుల సాధికారిక శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సమితిపరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 331 మంది వివిధ శారీరక లోపాలతో బాధపడుతున్న దివ్యాంగులకు జిల్లా కేంద్రాసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు.వీరిలో 57 మందికి దృష్టి లోపం, 42 మందికి ఈఎన్‌టీ సమస్యలు, 37 మంది మానసిక, 95 మంది శారీరక దివ్యాంగులుగా గుర్తించారు. అవసరమైన వారికి ఉపకరణాలు అందజేశారు.ముగ్గురికి వీల్ ఛైర్లు, నలుగురికి ఆసారా కర్రలు, ఇద్దరికి సీపీ వీల్‌ఛైర్లు, మరో ముగ్గురికి ట్రై సైకిళ్లు, హియిరింగ్ ఎయిడ్స్ తదితర ఉపకరణాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో గ్రూప్ డెవలప్‌మెంట్ అధికారి సుజిత్‌కుమార్ మిశ్రా, సమితి ఉపాధ్యక్షులు హరప్రసాద్ హిప్పుక, పంచాయతీ సర్పంచ్‌లు, సమితి సభ్యులు జిల్లా సామాజిక భద్రత అధికారి శ్రీకాంత్‌కుమార్ పాణిగ్రహి, దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి అమరేంద్రనాథ్ పాల్గొన్నారు.



టార్పాలిన్ కింద వంట చేస్తున్న నిర్వాహకులు

చెట్ల నీడలో.. టార్పాలిన్ కింద..

● వంట నిర్వహణకు అవస్థలు ● ఇదీ కోటిపాం పాఠశాలలో పరిస్థితి

కొమరాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటగది లేకపోవడంతో టార్పాలిన్, చెట్ల కింద వంటలు చేయాల్సివస్తోంది. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 375 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని తరగుతులకు గదులు ఉన్నా శిథిలావస్థకు చేరుకున్నాయి.వంట నిర్వహణకు ప్రత్యేక గదిలేకపోవడంతో చెట్ల కింద వండాల్సివస్తోంది. వర్షం కురిస్తే వంట నిర్వహణకు ఇబ్బందులు తప్పడంలేదు. చెట్ల కింద వంటలు చేస్తుండడంతో వండిన పదార్థాల్లో ఆకులు,వ్యర్థాలు రాలిపడుతున్నాయి. దీంతో ఆహార పదార్థాలు పాడవుతున్నాయని పలు వురువాపోతున్నారు.ప్రహరీకూడా శిథిలావస్థకు చేరడంతో వంటలు చేస్తున్న సమయంలో పశువులు వచ్చి ఇబ్బందిపెడుతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. వంట నిర్వహణ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు కోరుతున్నారు.



సీతానగరం: అన్నదాత సుఖీభవ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



పాలకొండ: మాట్లాడుతున్న జయకృష్ణ

రైతుకు అండగా కూటమి ప్రభుత్వం

● అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం చెక్కుల పంపిణీ

ఆర్థిక ఇబ్బందుల్లోనూ రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. శనివారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం చెక్కుల పంపిణీ కార్య క్రమం నిర్వహించారు.

●సీతానగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు గెలవాలి.. వ్యవసాయం నిలవాలనేది తెలుగుదేశం ప్రభుత్వం నినాదమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. మండలంలోని గుచ్చిమిలో అన్నదాత సుఖీభవ రైతు సదస్సులో భాగంగా అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద పార్వతీపురం నియోజకవర్గంలో రైతులకు రూ. 18.06 కోట్లు విడుదల కావడంతో రైతులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, వ్యవసాయాధికారులు అవినాష్, అశోక్, శ్రావణ్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

●పాలకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని కొండాపురంలో అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు అందించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్‌కుమార్, తేజోవతి, గర్భాన సత్తిబాబు, ఏఎంసీ ఛైర్మన్ సంధ్యారాణి, ఎంపీపీ బొమ్మాళి భానుమతి, కరణం మురళి, లెంక మనోహర్‌నాయుడు, రాయి రామకృష్ణ, జాడ శ్రీధర్ పాల్గొన్నారు.

తల్లి పాలు శ్రేయస్కరం

సీతానగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లి పాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని పెదభోగిలి పంచాయతీ పరిధిలోని అప్పయ్యపేట, సీతానగరం, బుడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రాల గర్భిణులకు అవగాహన సదస్సు అప్పయ్యపేటలో సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ పాల్గొన్నారు.

●కురుపాం,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలతోనే ఆరోగ్యం అని కురుపాం ఐసీడీఎస్ పీవో జి.రజనీ దుర్గ తెలిపారు. కురుపాంలో అంగన్‌వాడీ కార్యకర్త జె.సరోజ ఆధ్వర్యంలో తల్లిపాలువరోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీఓ జి.రజిని దుర్గ తల్లిపాలు ఆవశ్యకతపై వివరించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష,ఏఎన్ఎంలు పద్మ,పల్లవి పాల్గొన్నారు.

● సాలూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముంగివానివలసలో విశాఖకు చెందిన లీఫార్మ సహకారంతో మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 250 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు ఫౌండర్ లీలారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సాలూరు ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, శాంతి,అనురాధ,పుష్ప,విమల, లీలావతి పాల్గొన్నారు.



సాలూరు రూరల్: తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

●పాలకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగరపంచాయతీలోని ఏలాం జంక్షన్‌లోగల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రేడ్-1 సూపర్‌వైజర్ లింగాల శాంతకుమారి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారం, గర్భిణులు ఏయే ఆహారం తీసుకోవాలో వివరించారు.

నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ భాషపై శిక్షణ

పార్వతీపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు ఈ నెల ఏడో తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి శిక్షణ నిర్వహించనుందని తెలిపారు. యూరప్ దేశాల్లో నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జర్మన్ భాషను నేర్చుకొనేందుకు ఎనిమిది నుంచి పది నెలలపాటు విశాఖపట్నంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయాలతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి, బీఎస్సీ పూర్తి చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం కలిగి ఉండాని, ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్‌చేసిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్, క్లినికల్ అనుభవ పత్రాలతో పార్వతీపురం మన్యం జిల్లా లోని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

సీతంపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):సీతంపేటలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతరిక్షపరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు పర్యవేక్షణలో స్పేస్ సిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మ జయకృష్ణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఇటువంటి కార్య క్రమం నిర్వహించడం మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి, డీడీ అన్నాదొర, ఉప విద్యాశాఖాధికారి జి.రామ్‌మోహన్‌రావు, ఏఎంవో కోటిబాబు, ఎంఈవో ఆనంద్, జీసీడీవో రాములమ్మ పాల్గొన్నారు.

మైనింగ్ అధికారి అవినీతిపై దర్యాప్తు చేయాలి

బెలగాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా డివిజనల్‌మైన్స్ లోని ఓ అధికారి తమను వేధిస్తూ వసూళ్లకే పాల్పడతున్నారని, ఆయన అవినీతిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని జిల్లాలోని క్వారీయజమానులు కోరారు. సీఎంకార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు క్వారీ యజమానులు ఒక ప్రకటనలో తెలిపారు. తమను బెదిరించి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా మైన్స్ కార్యాలయంలో, తన నివాసంలో అవినీతి డబ్బుతో ఫర్నీచర్ కొన్నారని ఆరోపించారు. ప్రజలకు తన కార్యాలయంలో ఎప్పుడూ అందుబాటులో ఉండరని, ప్రైవేట్ వ్యక్తులను పెట్టి దందా చేస్తున్నారని పేర్కొన్నారు.

పణుకువలసలో వేంకటేశ్వర వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న గిరిజన భక్తులు

సాలూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలంలోని పణుకువలసలో సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో శనివారం సుబ్బ గురువు పర్యవేక్షణలో సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సామూహిక వేంకటేశ్వర వ్రతాన్ని రుత్వికుడు వినయ్‌శర్మ జరిపించారు. కార్యక్రమంలో సనాతన ధర్మపరిషత్ అధ్యక్షుడు కోలకోటి శంకరరావు, రాజేష్,పువ్వలసరి గోపి,దుర్గప్రసాద్,ఏడు కొండలు,మాజీ జడ్పీటీసీ మంచాల పారమ్మ,సొండి లక్ష్మి,ఇస్కాన్ ప్రతినిధి హరేకృష్ణ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సీతానగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని తల్లిదండ్రులు లేని పేద పిల్లలు 50 మందికి స్కాలర్ షిప్పులు అందజేసినట్లు వీకేసీ, యూనివర్సల్, ఫ్యామిలీ, ఫౌండేషన్ అండ్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణ ప్రతినిధులు కొల్లి ఈశ్వరరావు, శంకరరావు తెలిపారు. శనివారం సీతానగరంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 8, 9, 10 తరగతులు తల్లిదండ్రులు లేని వారికి వారి విద్యావసరాల నిమిత్తం ప్రతి నెల స్కాలర్ షిప్ రూపంలో ఇవ్వడానికి తమ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. దీనికి విద్యార్థి 85 శాతం మార్కులు సాధించినట్లుగా ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వారై ఉండాలని, ఉమ్మడి జిల్లాల్లోని ఎవరైనా అప్లై చేసుకోవచ్చునని తెలిపారు.

వర్షాలు కురవక.. సాగునీరు అందక!

(5వ పేజీ తరువాయి)

నిధులు మంజూరైనా తూతూ మంత్రంగా పూడికతీత పనులు చేపట్టారనే ఆరోపణలున్నాయి. పాత బ్యారేజీ కుడి, ఎడమ కాలువల పరిధిలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ, బలిజిపేట, వంగర మండలాల్లో 109 గ్రామాలకు సంబంధించి పిల్ల కాలువల అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నా అభివృద్ధి కానరావడం లేదు. చేసిన పనులనే దఫదఫాలుగా చేస్తున్నా ఎక్కడి తుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అందుబాటులో ఉండేలా!

(5వ పేజీ తరువాయి)

మొత్తం 269 కేంద్రాలు ఉండగా 1200 ఓటర్ల లోపు 266 కేంద్రాలు ఉండగా అత్యధిక ఓటర్లు ఉన్న కేంద్రాలు 3 వరకూ ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1200 ఓటర్ల లోపు 230, ఆపై ఓటర్లు ఉన్న కేంద్రాలు 13 వరకూ ఉన్నాయి. 'ఎన్నికల సంఘం అధికారుల ఆదేశాల మేరకు 1200 ఓటర్లకు ఓ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాల సేకరిస్తున్నాం. త్వరలో నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.' అని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి తెలిపారు.

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వారం చివరి పనిదినాల్లో ఈ తరగుతుల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తరగతి గదిలో బోధనా ప్రక్రియ, సైన్స్ ఫ్యాకల్టీ సామర్థ్యాలను నిరంతరం మెరుగుపరచడానికి ఈ శిక్షణ ఎంతోగానో దోహదపడుతుందని వెల్లడించారు. మారిన సిలబస్‌ను విద్యార్థులకు చక్కగా బోధించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాల కూర్పు, వివిధ గ్రూపుల సబ్జెక్టు కాంబినేషన్ల మార్పు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతుల్లో 14 జూనియర్ కళాశాలల గణిత అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భూముల స్వాధీనం సబబుకాదు

●కాకర్లవలస, కారేడువలస గ్రామాల్లో గిరిజనులకు తీవ్ర అన్యాయం ● ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

రామభద్రపురం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల పేరుతో గిరిజనులు సాగు చేస్తున్న భూములను స్వాధీనం చేసుకోవడం సబబుకాదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు తెలిపారు. కాకర్లవలస, కారేడువలస గిరిజనులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. శనివారం ఆ గ్రామాల్లో పర్యటించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా గిరిజనుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని, వారితరపున న్యాయం జరిగేవరకు పోరాడుతానని తెలిపారు. వందేళ్లుగా ఈ భూమిపై ఆధారపడి బతుకుతున్నారని, అయితే మధ్యలో 2017లో ఏపీఐఐసీకి 174 ఎకరాలు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించినట్లు గిరిజనులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు మతలబు చేశారని తెలిపారు. పదిరోజుల నుంచి గిరిజనులు ఈభూములకోసంఆందోళనలు చేస్తున్నా ఇక్కడి రాజకీయ నాయకులు, జిల్లా అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. 2017లో భూములు తీసుకున్న ఏపీఐఐసీ ఇప్పటివరకు ఎటువంటి నిర్మాణాలు చేయలేదని, 2013 భూసేకరణ చట్టం అనుసరించి సాగు చేస్తున్న భూములకు అప్పగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, కాకర్లవలస, కారేడువలస గిరిజనులు పాల్గొన్నారు.

గొరడలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరడ గ్రామంలో రేగిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వంద మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్ పెంటమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రాధా, ఏఎన్ఎం తిరు మలమ్మ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి

పార్వతీపురంటౌన్/సాలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు జేటీ తిరుమలా చార్యులు(53) శనివారం గుండెపోటుతో మరణించారు. స్థానిక కాలేటివారి వీధిలో నివాస ముంటున్న తిరుమలాచార్యులకు గుండెపోటురావడంతో విశాఖ కుటుంబ సభ్యులు తరలించారు. శనివారం తెల్లవారుజామున మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా ఆయన మృతదేహాన్ని స్వగ్రామం సాలూరు తరలించారు.

మక్కువలో ఈదురుగాలులు

మక్కువ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మక్కువలో శనివారం ఈదురుగాలులు, పిడుగులతో వర్షం కురిసింది.ఎండల తీవ్రతకు ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలకు కురిసిన వర్షం ఉపశమనం లభించింది. ఈదురుగాలుల వల్ల మక్కువలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రెండు గంటల తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

శ్మశానవాటికలో శ్రమదానం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం శ్మశాన వాటికలో కొండవీధి యువత శ్రమదానం చేశారు.ఈసందర్భంగా శ్మశానంలోని మందుబాబులు విడిచిపెట్టిన సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ గౌరీశంకరరావు, కొమరం భీమ్ యువత పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై నిలదీత

భామిని, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీటీసీ కె.చంద్రశేఖర్, కొండలరావు, సర్పంచ్‌లు రామారావు, మోహన్‌రావు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వసంతను నిలదీశారు. శనివారం ఎంపీపీ తోట శాంతి కుమారి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ రైతులకు యూరియా అందడం లేదని, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేయడంలేదని నిలదీశారు. అధికారులు హాజరుకాకపోవడం శోచనీయమని ప్రత్యేక ఆహ్వానితుడు తోట సింహాచలం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్ఎస్ రద్దు చేయాలి

కురుపాం,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): అన్ని యప్‌లు కలిసి ఒకే యాప్‌గా మార్చుచేయాలని, ఎఫ్‌ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబులు , 5జి నెట్ ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకులుకోరారు. కురుపాం ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులకు అంగన్‌వాడీ నాయకులు జె.సరోజ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈనెల నాలుగో తేదీన అంగన్‌వాడీలు సీడీపీవో కార్యాలయానికి ఫోన్లు అన్ని తిరిగి అప్పగిస్తామని, 5న నుంచి ఆన్‌లైన్ వర్క్‌చేయలేమని తెలిపారు.

యాజమాన్యాలతో మాట్లాడి న్యాయం చేయాలి

పార్వతీపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యాజమాన్యంతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని పార్వతీపురం ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే బోనెల విజయచం ద్రను పార్వతీపురంలో కలిశారు. యాజమాన్యం తమ డిమాండ్లు పరిష్కరించకుండా అన్యాయం చేస్తోందని విన్నవించారు. గతంలో మూడు సార్లు చర్చలు జరిగినా యాజమాన్యం సరిగా స్పందించకపోవడంతో సమ్మె చేయడానికి నిర్ణయించినట్టు ఎమ్మెల్యేకు వివరించారు.